తెలంగాణ
ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 01 | ఆదివారం | 12 - 07 - 2026 | ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి | పేజిలు : 1

## పెద్ద మనిషి సమక్షంలో

# తుంగతుర్తి కాంగ్రెస్ పంచాది

## వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డికి పీసీసీ చీఫ్ బాధ్యతలు



- గాంధీభవన్‌లో జగ్గారెడ్డి ఎంపీ చామల, సర్వోత్తమరెడ్డి, గుడిపాటి, ప్రీతం సమావేశం
- 9 మండలాల నుంచి హాజరైన నాయకులు, కార్యకర్తలు
- నేతల ముందు ఎమ్మెల్యేపై కేడర్ అదే ఆగ్రహం
- సమావేశానికి పోకుండా కొత్త అధ్యక్షులతో పీసీసీ చీఫ్‌ను కలిసిన ఎమ్మెల్యే

**ప్రజావారధి/మోత్కూరు**

తుంగతుర్తి కాంగ్రెస్ పంచాది కంటిన్యూ అవుతోంది. కాంగ్రెస్ మండలాల అధ్యక్షుల నియామకంతో ఉవ్వెత్తున్న ఆగ్రహ జ్వాలలు ఎగిసిపడగా ఎమ్మెల్యే అనుకూల, వ్యతిరేక వర్గం నాయకులు, కార్యకర్తలు రోడ్డున పడి కొట్టుకునే వరకూ వెళ్లింది. పంచాది కాస్తా గాంధీభవన్‌కు చేరడంతో పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ ఆ పంచాది పెద్ద మనిషిగా వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డికి బాధ్యతలు అప్పగించారు. దీంతో రంగంలోకి దిగిన ఆయన శనివారం గాంధీభవన్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశానికి భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఏఐసీసీ లీడర్ రాంరెడ్డి సర్వోతమరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం, సూర్యాపేట డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, చెవిటి వెంకన్నయాదవ్ హాజరు కాగా, నియోజకవర్గంలోని 9 మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ఎంపీ, సర్వోతమరెడ్డి, ప్రీతం, డీసీసీ అధ్యక్షుడు నర్సయ్య, చెవిటి వెంకన్నలతో మాట్లాడిన జగ్గారెడ్డి వారి నుంచి నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలు, పార్టీ కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు జరుగుతున్న అన్యాయం, పార్టీ సీనియర్లకు ఎలాంటి సమాచారం లేకుండా బీఆర్ఎస్ నుంచి వచ్చిన నాయకులకు పార్టీ అధ్యక్ష పదవులు ఇచ్చిన విషయంపై వివరాలతో సహా జగ్గారెడ్డికి అందజేసినట్టు తెలిసింది. 9 మండలాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు తమకు జరుగుతున్న అన్యాయంపై నేతల ముందు తమ గోడ వెల్లబోసుకుని నిరసన వ్యక్తం చేశారు. సేవ్ కాంగ్రెస్, ఎమ్మెల్యే కబంధ హస్తాల నుంచి కాంగ్రెస్‌ను కాపాడాలంటూ నినాదాలు చేశారు. బీఆర్ఎస్ నాయకులకు ఇచ్చిన అధ్యక్ష పదవులను తొలగించాలని, పార్టీలో సీనియర్లకు పదవులు



ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగిల్ విండో చైర్మన్, మార్కెట్ చైర్మన్ పదవులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అసలైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకే టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండలాలవారీగా 9 మండలాలకు చెందిన ముఖ్య నాయకులతో మాట్లాడి వారి అభిప్రాయాలు కూడా తెలుసుకున్నారు. పార్టీ లైన్ ఎవరూ క్రాస్ చేయవద్దని, ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిచినంత మాత్రాన ఎవరూ తోపు కాదని, రెండోసారి బీఫాం వచ్చి ఎమ్మెల్యేగా గెలిస్తేనే నాయకుడిగా కొనసాగుతారని, అధిష్ఠానం కన్నెర్ర చేసి బీఫాం ఇవ్వకుంటే అడ్రస్ లేకుండా పోతారని జగ్గారెడ్డి కార్యకర్తలను సముదాయించారు. ఎమ్మెల్యేతో కూడా మాట్లాడతానని, 12న మధ్యాహ్నం వచ్చి కలుస్తానని ఎమ్మెల్యే చెప్పారని, ఆయనతో మాట్లాడిన తర్వాత అధిష్ఠానంకు నివేదిక ఇచ్చి అందరికీ తగిన ప్రాధాన్యత దక్కేలా చూస్తానని హామీ ఇచ్చినట్టు తెలిసింది.

### సమావేశానికి పోకుండా కొత్త అధ్యక్షులతో పీసీసీ చీఫ్‌ను కలిసిన ఎమ్మెల్యే

ఇదిలా ఉండగా ఎమ్మెల్యే మందుల సామేల్ గాంధీభవన్‌లో జగ్గారెడ్డితో ఉన్న సమావేశానికి వెళ్లకుండా నియోజకవర్గంలో కొత్తగా నియమించిన 9 మండలాల అధ్యక్షులతో కలిసి పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిశారు. మండలాల అధ్యక్షులను ఆయనకు పరిచయం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఒకవైపు కొత్త అధ్యక్షుల నియామకం వివాదాస్పదమై పంచాది నడుస్తోండగా, మరోవైపు ఎమ్మెల్యే సామేల్ అదే అధ్యక్షులతో కలిసి గాంధీభవన్‌లో జగ్గారెడ్డితో సమావేశం ఉన్న సమయంలోనే పీసీసీ చీఫ్‌ను కలవడం హాట్ టాపిక్‌గా మారింది. నూతన అధ్యక్షుల నియామకంలో ఇరువర్గాలు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా తమ పంతం నెగ్గించుకోవడానికి పావులు కదుపుతున్నారు. ఆదివారం ఎమ్మెల్యే సామేల్ జగ్గారెడ్డితో సమావేశం కానున్న నేపథ్యంలో ఆ తర్వాత తుంగతుర్తి కాంగ్రెస్ రాజకీయం ఏ టర్న్ తీసుకుంటుందో చూడాలి.